


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్ గిరి | శనివారం | 22.08.2026 | సంపుటి: 3 | సంచిక: 199 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 22.08.2026 | VOLUME : 3 | ISSUE : 199 | PAGES: 8 | COST: 2/- |



# నటి షావుకారు జానకి కన్నుమూత

- షావుకారు సినిమాతో ఆ పేరు స్థిరపడిపోయింది

**చెన్నై, ఆగస్టు 21 :**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి(94) శుక్రవారం చెన్నైలో కన్నుమూశారు. వయోభారంతోపాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఇటీవల చెన్నైలోని కావేరి హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆమె మరణ వార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి

మిగతా 3వ పేజీలో..





3

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రాష్ట్రం సన్నద్ధం

- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రులు



## రాయదుర్గం భూమికి రూ.264 కోట్ల రికార్డు

ఐటీ కారిడార్‌లో కొత్త గరిష్ఠ ధర
5.25 ఎకరాల స్థలానికి భారీ డిమాండ్
మే రికార్డును తిరగరాసిన తాజా వేలం
నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రభావం
ప్రభుత్వానికి భారీగా సమకూరుతున్న ఆదాయం

2



# ఆక్స్‌ఫర్డ్‌కు రేవంత్ ఆహ్వానం

- హైదరాబాద్‌లో విద్యా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- తెలంగాణ యువతకు అంతర్జాతీయ అవకాశాలపై దృష్టి
- విద్య, పరిశోధన, నైపుణ్య రంగాల్లో భాగస్వామ్యం
- తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్‌ను ఆహ్వానం

**ఆక్స్‌ఫర్డ్, ఆగస్టు 21:**

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో కలిసి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన.. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందించేందుకు భాగస్వామ్యంపై ప్రొఫెసర్లతో చర్చించారు.

**హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు**

బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బెలియోల్ కాలేజీ ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీలతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన సీఎం.. ఆక్స్‌ఫర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, పరిశోధన సామర్థ్యాలను హైదరాబాద్‌కు తీసుకురావాలని కోరారు. నగరంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, ఉద్యోగ నిపుణులకు

మిగతా 2వ పేజీలో..





## ఆక్స్‌ఫర్డ్‌లో రేవంత్ బృందం చర్చలు

- బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ సందర్శన
- గుడ్ గవర్నెన్స్‌పై విస్తృత చర్చలు
- ప్రజా విధానాల రూపకల్పనపై సమాలోచనలు
- నైపుణ్యాభివృద్ధికి సహకారంపై దృష్టి
- తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి శిక్షణ లక్ష్యం

2

## సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దు

- విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరణ నేపథ్యంలో
- కొనసాగుతున్న యూకే పర్యటన

2



## ప్రతీ రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే

- భూసేకరణ, ఆ ర్ అండఆర్ చెల్లింపుల్లో కలెక్టర్లు మిషన్ మోడ్‌లో పనిచేయాలి
- తక్షణమే పంపిణీకి సిద్ధంగా దాదాపు రూ.1,200 కోట్లు
- నిధుల కోసం చూడొద్దు.. అవార్డులు, టోకెన్ల ప్రక్రియ పూర్తి చేయాలి
- అటవీ అడ్డంకులనూ యుద్ధప్రాతిపదికన తొలగించాలి
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

3



## అధికారుల నిర్లక్ష్యంపై పొంగులేటి ఆగ్రహం

- ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సస్పెన్షన్
- రాయికల్ తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు
- ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు పూర్తిగా చెల్లింపు
- ఇళ్ల కేటాయింపులో రాజకీయ సిఫార్సులకు చోటులేదు
- భూ భారతి వ్యవహారంపై సిట్ దర్యాప్తు

2

## రాయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

- కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు నిరాకణ
- హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు సూచన

2



EAGLE FORCE
ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT

## ఆల్ప్రాజోలం ముఠాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన డ్రగ్ నెట్‌వర్క్ ఛేదన
- 15 మంది కీలక నిందితుల అరెస్టు
- రూ.6 కోట్ల ఆస్తుల జప్తు ప్రక్రియ
- 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం
- సతారాలో అక్రమ తయారీ కేంద్రం గుర్తింపు
- ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు

**బోధన్, ఆగస్టు 21:**

తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్, బోధన్ పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ చేపట్టారు. కల్తీకల్లు

మిగతా 2వ పేజీలో..

## సంబంధం లేకుంటే ఖండించాలి కదా



- మంత్రి సురేఖపై పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం
- సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాల్సిందే

3



2

## అధికంగా తీసుకున్న ఫీజులు వాపస్ చేయాలి

- బీజేపీ అధ్యక్షుడికి 'నీట్' విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

## బండి సంజయ్‌తో యోగి భేటీ

- తెలంగాణ రాజకీయ పరిస్థితిపై చర్చ
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి
- తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం
- నేతలంతా ఐక్యంగా పనిచేయాలని సూచన
- యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం
- మోదీ నాయకత్వంపై యోగి ధీమా



4

# సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 21 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. ఈ ప్రతినిధి బృందం యూకే, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించినట్లు కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి యూకే, అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్రానికి తెలియజేసింది. తెలంగాణ అభివృద్ధి, విద్యారంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు 'రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం' పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి అని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను ఎప్పుడూ విశ్వసిస్తానని వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, ఆయా విశ్వవిద్యాలయాలతో అవసరమైన అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 'హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్.. ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం యూకేలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో ప్రయత్నిస్తారు. 'హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం., ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎలఎసఈ వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై
# పొంగులేటి ఆగ్రహం

**జగిత్యాల, ఆగస్టు 21:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై మంత్రి పొంగులేటి కఠిన చర్యలు ప్రకటించారు.

**తహసీల్దార్ సస్పెన్షన్**

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాతను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలపై సమీక్షలో సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాయికల్ తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

**భూ వ్యవహారాలపై కఠిన చర్యలు**

ధరణి పోర్టల్ నిర్వహణలో గతంలో జరిగిన అవకతవకలు, విధుల్లో అలసత్వం చూపే అధికారులపై కఠిన చర్యలు తప్పవని పొంగులేటి హెచ్చరించారు. ఎలాంటి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు చెల్లింపు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో రాజకీయ సిఫార్సులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో 8 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించామని, ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

**భూ భారతి ద్వారా సమస్యలకు పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి విధానాన్ని తీసుకొచ్చామని పొంగులేటి తెలిపారు. భూ భారతి అమలును అడ్డుకునేందుకు గత పాలకులు ప్రయత్నించారనే ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## రాయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :** రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం ప్రక్రియలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వేలం పక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ మోహన్ ఉన్నారు. దీంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం కొనసాగించేందుకు టీజీఐఐసీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లయ్యాయి. పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎకరాకు రూ.175 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. అయితే పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేయనున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని, అవి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం టీజీఐఐసీ నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అంతేకాదు తదుపరి పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది.





# ఆక్స్‌ఫర్డ్‌కు రేవంత్ ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి**

అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించాలని ఆహ్వానించారు.

**భాగస్వామ్యానికి సానుకూల స్పందన**

విదేశీ విశ్వవిద్యాలయాలకు జాతీయ విద్యా విధానం కింద ఉన్న అవకాశాలను సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వివరించారు. తెలంగాణతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులను రావాలని తెలంగాణ బృందం ఆహ్వానించింది.

**సోమర్‌విల్ కాలేజీలో ఇందిరా గాంధీ చిత్రపటం**

ఆక్స్‌ఫర్డ్ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. అక్కడ విద్యాభ్యాసం చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియాగాంధీ ఈ చిత్రపటాన్ని కాలేజీకి బహూకరించారు.

**క్రీడా రంగంలో పెట్టుబడులకు పిలుపు**

అనంతరం జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సీఎం సందర్శించారు. సంస్థ కార్పొరేట్ చైర్మన్ కిరణ్‌కుమార్ గ్రంధితో కలిసి అక్కడి క్రీడా సదుపాయాలను పరిశీలించారు. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని జీఎంఆర్ ప్రతినిధులను కోరారు. యూకే పర్యటనలో భాగంగా ఎమిరేట్స్ స్టేడియంలో ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే మ్యాచ్‌ను కూడా సీఎం వీక్షించనున్నారు.

# ఆక్స్‌ఫర్డ్‌లో రేవంత్ బృందం చర్చలు

**లండన్, ఆగస్టు 21:** యూకే పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. విశ్వవిద్యాలయంలోని బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఆక్స్‌ఫర్డ్ అధ్యాపక ప్రతినిధులతో సమావేశమైన బృందం తెలంగాణలో పరిపాలన, ప్రజా విధానాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించింది.

**ఘన స్వాగతం**

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైజల్ దేవ్‌జీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులకు స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ ప్రతినిధి బృందంతో విశ్వవిద్యాలయ అధ్యాపకులు సమావేశమయ్యారు.

**గుడ్ గవర్నెన్స్‌పై చర్చ**

సమావేశంలో ఉత్తమ పరిపాలనా విధానాలు, ప్రజా విధానాల రూపకల్పనపై ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడం, సంక్షేమ కార్యక్రమాలను మెరుగ్గా అమలు చేయడం వంటి అంశాలపై అనుభవాల మార్పిడికి అవకాశాలను పరిశీలించారు.

**నైపుణ్యాభివృద్ధికి భాగస్వామ్యం**

తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఆక్స్‌ఫర్డ్‌తో సహకారం పెంచే అంశంపైనా చర్చలు జరిగాయి. ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలు, ఆధునిక నైపుణ్యాలను రాష్ట్ర విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా భాగస్వామ్య మార్గాలను అన్వేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**తెలంగాణకు అంతర్జాతీయ విద్యా అనుసంధానం**

విద్య, పరిపాలన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రపంచంలోని ప్రముఖ సంస్థలతో తెలంగాణకు అనుసంధానం పెంచే దిశగా పర్యటన కొనసాగుతోంది. ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో సహకారం రాష్ట్ర యువతకు మరిన్ని అవకాశాలను అందించడంతో పాటు పరిపాలనా వ్యవస్థలోనూ కొత్త విధానాలను ప్రవేశపెట్టేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆల్ప్రాజోలం ముఠాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి**

తయారీలో వినియోగించే ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న ముఠాకు చెందిన 15 మంది కీలక నిందితులను అరెస్టు చేసి, 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా కూడబెట్టినట్లు గుర్తించిన సుమారు రూ.6 కోట్ల మార్కెట్ విలువైన ఆస్తులపై జప్తు చర్యలు ప్రారంభించారు.

**సతారాలో తయారీ కేంద్రం**

బోధన్‌లో జరిగిన దాడుల్లో ఆల్ప్రాజోలం, నగదు, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి ఆధారంగా మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్నారు. అక్కడి 'సూర్యప్రభ ఫార్మా కెమ్'పై దాడి చేసి అక్రమంగా




తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.4 కోట్ల విలువైన రసాయన ఫ్యాక్టరీని కూడా సీజ్ చేశారు.

**కల్తీకల్లు కేసులతో వెలుగులోకి**

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కల్తీకల్లులో ఆల్ప్రాజోలం వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు ముమ్మరమైంది. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారిలో 15 మంది అస్వస్థతకు గురైన ఘటనలు కూడా దందాపై నిఘా పెంచడానికి కారణమయ్యాయి. జహీరాబాద్‌లో 750 గ్రాముల ఆల్ప్రాజోలం, రూ.7.50 లక్షల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు.

**రూ.6 కోట్ల ఆస్తులపై చర్యలు**

డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల స్థలాలు, వాహనాలు, రసాయన ఫ్యాక్టరీపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68(ఎఫ్) కింద చర్యలు చేపట్టారు. వీటి ప్రభుత్వ విలువ సుమారు రూ.2.5 కోట్లు కాగా, మార్కెట్ విలువ దాదాపు రూ.6 కోట్లుగా అధికారులు అంచనా వేశారు.

**అక్రమార్జనపై కఠిన చర్యలు**

డ్రగ్స్ వ్యాపారం ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఈగల్ ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. అక్రమ సంపాదనతో కూడబెట్టిన ఆస్తులను గుర్తించి చట్ట ప్రకారం జప్తు చేస్తామని హెచ్చరించారు.

# అధికంగా తీసుకున్న ఫీజులు వాపస్ చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 21 :** ఎంబీబీఎస్ నాలుగున్నరేళ్ల అకాడమిక్ కోర్సుకు మాత్రమే ట్యూషన్ ఫీజు వసూలు చేయాలని టీఏఎఫ్ఆర్‌సీ, ఎన్ఎంసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొన్ని కాలేజీలు ఇంటర్న్‌షిప్ కూడా కలుపుకుని పూర్తి ఐదేళ్లకు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయని నీట్, ఎంబీబీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో విద్యార్థుల సమస్యలపై వారి తల్లిదండ్రుల ప్రతినిధి బృందం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుని కలిసి వినతిపత్రం సమర్పించింది. విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనివ్వకపోవడం, పరీక్షల హాల్ టికెట్లు నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు. కొన్ని కళాశాలలు విద్యార్థులకు చెల్లించాల్సిన స్టైఫండ్‌ను నిలిపివేయడం లేదా చెల్లించిన స్టైఫండ్‌ను తిరిగి తీసుకుంటున్నాయని కూడా ఫిర్యాదు చేశారు. అధికంగా వసూలు చేసిన ఫీజులను తక్షణమే తిరిగి చెల్లించాలని, నిబంధనల ప్రకారం విద్యార్థులకు స్టైఫండ్ అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది.



దీనిపై రామచందర్ రావు స్పందిస్తూ బాధిత విద్యార్థులకు బీజేపీ అండగా నిలుస్తుందని, వారి సమస్యలను బలంగా ప్రస్తావిస్తుందని హామీ ఇచ్చారు. టీఏఎఫ్ఆర్‌సీ, ఎన్ఎంసీ ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేసి బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# రాయదుర్గం భూమికి రూ.264 కోట్ల రికార్డు

**హైదరాబాద్, ఆగస్టు 21:** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. రాయదుర్గంలోని పాన్‌మక్తా పరిధిలో టీజీఐఐసీ నిర్వహించిన తాజా ఈవేలంలో ఎకరం భూమి రూ.264 కోట్లకు అమ్ముడైంది. సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల స్థలానికి జరిగిన ఈ వేలంలో నమోదైన ధర దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోనే అత్యధికాల్లో ఒకటిగా నిలిచింది.

**పాత రికార్డులకు బ్రేక్**

రాయదుర్గంలో ప్రభుత్వ భూముల వేలం ద్వారా ధరలు వరుసగా పెరుగుతున్నాయి. ఇదే సర్వే నంబర్‌లో మే 2026లో నిర్వహించిన 6.29 ఎకరాల వేలంలో ఎకరం రూ.237 కోట్లు పలికింది. ఆ రికార్డును తాజాగా రూ.264 కోట్ల ధర అధిగమించింది. జూన్‌లో జరిగిన మరో 5.09 ఎకరాల వేలంలో ఎకరానికి రూ.204 కోట్లు లభించాయి. అంతకుముందు 2025




అక్టోబర్‌లో రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం రూ.177 కోట్లకు విక్రయమైంది.

**కీలక ప్రాంతాల మధ్యలో..**

రాయదుర్గం చుట్టూ ఉన్న వాణిజ్య ప్రాంతాలు భూముల విలువను గణనీయంగా పెంచుతున్నాయి. మైండ్‌స్పేస్, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన ఐటీ, వ్యాపార కేంద్రాలకు ఈ ప్రాంతం సమీపంలో ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది.

**భారీ నిర్మాణాలకు అనుకూలత**

ఐటీ కారిడార్‌లో పెద్ద విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు పరిమితంగా ఉండటం కూడా డిమాండ్ పెరగడానికి కారణంగా మారింది. భవనాల ఎత్తుపై ఉన్న వెసులుబాటుతో బహుళ అంతస్తుల కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో భూమి కోసం పోటీ పెరిగి వేలం ధరలు కొత్త గరిష్ఠాలను తాకుతున్నాయి.

**ఖజానాకు భారీ ఆదాయం**

రాయదుర్గంలో వరుసగా నిర్వహిస్తున్న భూముల వేలం ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. ఐటీ, వాణిజ్య రంగాల విస్తరణతో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూముల విలువ మరింత పెరిగే అవకాశాలున్నాయనే అంచనాలు రియల్ ఎస్టేట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

# ప్రతీ రూపాయి రైతుల ఖాతాల్లోకి చేరాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 21 :**
భూమిని కోల్పోయిన రైతుకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం సకాలంలో అందకపోతే నిధులు మంజూరు చేసిన లక్ష్యమే నెరవేరదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రతీ రూపాయి అంతిమంగా భూమి కోల్పోయిన రైతు, నిర్వాసిత కుటుంబం ఖాతాలోకి చేరాల్సిందేనని, కలెక్టర్ల పీడీ ఖాతాల్లో నిధులు ఉండిపోవడం వల్ల ప్రయోజనం లేదని తేల్చిచెప్పారు. కీలక నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతికి అడ్డంకిగా మారిన భూసేకరణ, పునరావాసంపునర్నిర్మాణం(ఆర్ అండ్ ఆర్), అటవీ అనుమతులు తదితర సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైన పత్రాలు, లబ్దిదారుల వివరాలు పూర్తిగా ఉన్నచోట ఒకటి రెండు రోజుల్లోనే పరిహారం రైతులు, నిర్వాసితుల ఖాతాల్లో జమ కావాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ భూములకు సంబంధించిన చెల్లింపులు తదితర సమస్యలు అడ్డంకిగా ఉండకూడదన్నది ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టమైన సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి రూ.5 వేల కోట్లను కేటాయించారని తెలిపారు. ఇంత పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం సమకూర్చినప్పుడు ఆ నిధులు బాధితులకు చేరేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. 'నిధులను కలెక్టర్ల పీడీ ఖాతాల్లో జమ చేయడంతో ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు.. ఆ డబ్బు భూమి ఇచ్చిన రైతుకు, నిర్వాసిత కుటుంబానికి చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.. మంజూరు నుంచి లబ్దిదారుడి ఖాతాలో జమయ్యే వరకు ఉన్న ప్రతి అనవసర పరిపాలనా అడ్డంకినీ తొలగించాలి' అని ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ తదితర అవసరాల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,782 కోట్లు విడుదల చేయగా సుమారు రూ.566 కోట్లు లబ్దిదారులకు చేరాయని సమీక్షలో వెల్లడైంది. మరో రూ.989 కోట్లు వివిధ దశల్లో చెల్లింపుల ప్రక్రియలో ఉండగా రూ.199 కోట్లు జిల్లాల వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ ప్రకారం దాదాపు రూ.1,200 కోట్లను తక్షణమే లేదా స్వల్ప పరిపాలనా ప్రక్రియ పూర్తి చేసి లబ్దిదారులకు అందించే అవకాశం ఉందని, ఈ మొత్తాన్ని రైతులు, నిర్వాసితుల ఖాతాల్లోకి చేర్చడాన్ని అత్యవసర కార్యక్రమంగా చేపట్టాలని కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అదనంగా సుమారు రూ.455 కోట్లకు సంబంధించిన టోకెన్లు క్లియర్ అయి తదుపరి ప్రక్రియలో ఉన్నాయని వెల్లడైంది. విడుదలైన నిధులకు, రైతులకు జరిగిన వాస్తవ చెల్లింపులకు మధ్య ఉన్న అంతరాన్ని రోజూ పర్యవేక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ల పీడీ ఖాతాల్లోకి డబ్బులు వచ్చిన తరువాతే భూసేకరణ ప్రక్రియ మొదలుపెట్టాలనే పద్ధతికి స్వస్తి పలకాలని మంత్రి స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియ, కన్సెంట్ అవార్డులు, అవార్డు నంబర్లు, టోకెన్ల జనరేషన్ వంటి ప్రక్రియలన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. అవార్డు నంబర్లు, టోకెన్ వివరాలు సిద్ధమైన వెంటనే అవసరమైన నిధుల విడుదల కోసం నీటిపారుదల శాఖ ఆర్థిక శాఖతో సమన్వయం చేస్తుందని తెలిపారు.

**మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌పై ప్రత్యేక సమీక్ష**

మహబూబాబాద్ జిల్లాలోని మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ భూసేకరణ అంశాన్ని కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. రైతులతో జరిగిన చర్చలకు అనుగుణంగా కన్సెంట్ అవార్డులు, సవరించిన పరిహార అంచనాలను వేగంగా పూర్తి చేయాలని, భూసేకరణ సమస్యల కారణంగా ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. అటవీ అనుమతులకు సంబంధించిన అడ్డంకులపైనా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. శాఖల మధ్య సమన్వయ లోపం లేదా అవసరమైన సమాచారం అందించడంలో జాప్యం కారణంగా పనులు నిలిచిపోవడానికి వీల్లేదన్నారు. జిల్లా కలెక్టర్లు రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖల అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తోపాటు ఇతర నీటిపారుదల పథకాలకు సంబంధించిన అటవీ సమస్యలను సమావేశంలో ప్రత్యేకంగా సమీక్షించారు. భూసేకరణ, ఆ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 'ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతు పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకూడదు.. ప్రభుత్వం వద్ద నిధులున్నప్పుడు పరిపాలనా జాప్యం కారణంగా బాధితుడు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండొద్దు.. ప్రాజెక్టు ముందుకు సాగాలి.. రైతుకు న్యాయం జరగాలి -రెండూ ఒకేసారి సాధించాలి' అని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఇంజనీర్-ఇన్-చీఫ్(జనరల్) ఓ.వి.రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఈఎన్‌సీ(అడ్మినిస్ట్రేషన్) టి. శ్రీనివాస్, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం అండ్ క్వాలిటీ కంట్రోల్) ఆర్.మధుసూదన్ రావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వారం రోజుల సమయం కుదరదు**

జగిత్యాల జిల్లాలో భూసేకరణ కోసం ఇప్పటికే జమ చేసిన నిధులను ఒకటి రెండు రోజుల్లోనే పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు వారం రోజుల సమయం కావాలన్న అధికారుల అభ్యర్థనను ఆయన అంగీకరించలేదు. నిధులు అందుబాటులో ఉండి లబ్దిదారుల వివరాలు సిద్ధంగా ఉన్నప్పుడు పరిహారం చెల్లింపును వారం రోజులపాటు నిలిపివేయడానికి కారణం ఉండదని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ ఫీడర్ కెనాల్‌తోపాటు ఇతర పనులకు అవసరమైన సుమారు 180 ఎకరాల భూసేకరణకు సంబంధించిన కన్సెంట్ అవార్డులను మొత్తం ఆర్థిక ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రాష్ట్రం సన్నద్ధం

- మంత్రులు తుమ్మల, సీతక్క, వాకిటి శ్రీహరి
- రాజేంద్రనగర్‌లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్
- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి
- ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రులు
- గ్రామానికి సంబంధించిన సమగ్ర వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచే ఏర్పాట్లు

**రాజేంద్రనగర్, ఆగస్టు 21 :**
ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇతర రాష్ట్రాల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను రూపొందించిందన్నారు. రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీలో ఎల్‌నినో ప్రభావం, వివిధ ప్రభుత్వ రంగాల్లో చేపట్టాల్సిన ముందస్తు కార్యాచరణపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావాన్ని కేవలం విపత్తుగా చూడకుండా ముందస్తు ప్రణాళికతో అవకాశంగా మలుచుకోవాలని మంత్రులు సూచించారు. రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామస్థాయిలో ప్రతీ శాఖ విడివిడిగా కాక వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతీ గ్రామానికి సమగ్రాభివృద్ధి ప్రణాళిక రూపొందించి స్వల్పకాలిక అవసరాలతోపాటు వచ్చే ఐదు, పది సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులను ఎంపిక చేయాలని సూచించారు. వీబీజీ రామ్‌జీ నిధులను యాదృచ్ఛికంగా కాక ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని, ఉపాధి హామీ నిధులతో శాశ్వత సామాజిక ఆస్తులను నిర్మించాలని మంత్రులు సూచించారు. నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతీ పంటకు పంట కుంట, ప్రతీ గ్రామానికి ఊట కుంట వంటి పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. పంట కుంటల ద్వారా భూగర్భ జలాలు పెరగడంతోపాటు వ్యవసాయం, చేపల పెంపకం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు ప్రజల భాగస్వామ్యంతో, గ్రామ సభల నుంచే రూపొందాలని, ప్రతీ పనికి జియో ట్యాగింగ్ చేయాలని, ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఎక్కువమందికి ఉపయోగపడే, ఒకే పనితో అనేక ప్రయోజనాలు కలిగే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలి : మంత్రి సీతక్క**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాలను ఇప్పటినుంచే సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అన్నారు. ప్రతీ గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలని, జీపీఎస్‌ఏపీ కేవలం ఒక డాక్యుమెంట్ కాదని, అది గ్రామ భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శకమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలు గ్రామ సభల నుంచే రావాలని, ఐదు, పది సంవత్సరాల దృష్టితో గ్రామాల భవిష్యత్తును ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, స్వల్ప, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయంతో ఒకే పనికి అనేక ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న క్షేత్రస్థాయి అధికారులు రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అధిక సంఖ్యలో ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీకి వెబ్‌సైట్‌ను మంత్రులు, సీఎస్ ప్రారంభించారు. గ్రామంలోని వనరులు, అవసరాలు, చేపట్టాల్సిన స్వల్ప, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు ఇందులో ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : మంత్రి తుమ్మల**

గ్రామ స్థాయిలో అనుబంధం ఉన్న అన్ని శాఖలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమావేశం నిర్వహించడం అభినందనీయమని మంత్రి తుమ్మల అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. జిల్లాస్థాయిలో కూడా అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని, తమ కోసం అధికారులు కష్టపడి పనిచేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు. ప్రజల మేలు కోసం పనిచేసే అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. ఉపాధి హామీ నిధులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాలని, నీటి సంరక్షణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా దాని ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మన చేతుల్లోనే ఉందన్నారు. భారీ ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ సుమారు 30 లక్షల బోర్లపై సాగు ఆధారపడి ఉందని, అందువల్ల భూగర్భ జలాలను పెంచే పనులను ఉపాధి హామీ ద్వారా విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని, గత రెండేళ్లలో లక్ష ఎకరాల్లో పామాయిల్ సాగును పెంచామని, యేటా రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలను పెంచడమే లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు.

**పంటల మార్పిడితో మార్పులు తేవచ్చు : మంత్రి వాకిటి**

దేశం గతంలో కూడా ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొందని, 1951 నుంచి ఇప్పటివరకు భారత్ 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కరవును ఎలా ఎదుర్కోవాలో రైతులకు అవగాహన ఉన్నప్పటికీ ఆ అవగాహనను ఆచరణలో పెట్టించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తేవచ్చని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణతో ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని, తెలంగాణ కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చేపల పెంపకానికి అవసరమైన నీటిని అందుబాటులో ఉంచేందుకు చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయాలని సూచించారు. మేకలు, గొర్రెల మేత కోసం ప్రత్యేక ప్రాంతాలను గుర్తించి కేటాయించడం ద్వారా పశు సంపదను పెంచుకోవచ్చన్నారు. ఎలాంటి కరవు పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందుకు సాగే రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలని, భరోసా కల్పించాలని అన్నారు. ముందస్తు ప్రణాళికతో రాష్ట్రాన్ని దేశానికే ఒక మోడల్‌గా నిలపవచ్చని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి : సీఎస్ సంజయ్ జాజు**

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో విస్తృతంగా వరి సాగు ప్రారంభమైందని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. ఇంకా సుమారు 20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్‌లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పెరిఅర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పూల సాగును ప్రోత్సహించాలని, వాటికి అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వీబీజీ రామ్‌జీ ద్వారా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో పక్కా ప్రణాళిక ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**అవసరమైన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలి : ఎంపీ నరేందర్‌రెడ్డి**

ప్రజలకు అవసరమైన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. కేవలం టార్గెట్లు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అవసరం లేని పనులు చేపట్టవద్దని సూచించారు. వీబీజీ రామ్‌జీ కింద రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాక ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే పనులు చేపట్టాలన్నారు. రైతులు వేసిన పంటలు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, క్షేత్రస్థాయిలో విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని ఆయన అన్నారు. వర్క్‌షాప్‌లో పలువురు సర్పంచులు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సహకారం గురించి వివరించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సమగ్ర వివరాలు అందుబాటులో ఉండేలా ప్రతీ గ్రామానికి ఒక వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను రూపొందించి తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలో అగ్రగామిగా, స్వయం సమృద్ధిగా, ఉండేలా అనుబంధ శాఖలతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు.

వర్క్‌షాప్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, టీజీఐఆర్డీ సీఈవో నిఖిల, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కొర్ర లక్ష్మి, ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవోలు, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంబంధం లేకుంటే ఖండించాలి కదా

**హైదరాబాద్, ఆగస్ట్ 20 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. సుష్మిత□ వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని, అది పూర్తిగా ఆమె వ్యక్తిగతమంటూ క్రమశిక్షణ కమిటీకి మంత్రి సురేఖ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలునాయక్, నాయిని రాజేందర్ రెడ్డిలు సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుష్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలన్నారు. ఎత్తిన జెండాను దించకుండా పార్టీని రేవంత్ అధికారంలోకి తెచ్చారని, ఆయనపై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. సుస్మిత వ్యాఖ్యలపై సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. కష్టపడుతున్న సీఎంపై బండలేస్తారా అంటూ నిలదీశారు. సొంత పార్టీ నేతలే సీఎంపై విమర్శలు చేయడం బాధాకరమని ఐలయ్య అన్నారు. కుమార్తె సుష్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని వేముల వీరేశం అన్నారు. సురేఖ భాష పార్టీని ఇబ్బంది పెడుతోందని, సమంత విషయంలో కూడా ఇలాగే మాట్లాడారని మండిపడ్డారు. 'వి□ తప్పుడు భాషకు సీఎం మ□ల్యం చెల్లించాలా.. వి□ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం పార్టీ బలి కావాలా అని ప్రశ్నించారు. అధికారంలోకి రావడానికి రేవంత్ చెమట చుక్కలు త్యాగం చేశారు.. ముఖ్యమంత్రిని బలహీనం చేయాలనే కుట్ర చేస్తున్నారు.. పార్టీలో జరుగుతున్న వ్యవహారంపై స్పందిస్తున్నాం.. సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాలి.. సీఎం నిర్ణయాలను తప్పుపట్టడం దుర్మార్గం.. ఆయన నిర్ణయాలు తప్పుపట్టేవాళ్లు పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు.. సొంత పార్టీ నేతలు ప్రతిపక్షాలకు గొంతు ఇస్తున్నారు.. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన వారిని పక్కనపెట్టాలి.. పార్టీ వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడతారా.. మైక్ దొరికితే ఊగిపోవడమేనా అంటూ సీఎంపై అసత్య ఆరోపణలు చేసినా, ఏకవచనంతో మాట్లాడినా ఊరుకోం' అని హెచ్చరించారు. పార్టీకి వ్యతిరేకంగా రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడినా, బాలు నాయక్ మాట్లాడినా చర్యలు తీసుకోవాలని బాలునాయక్ అన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి అయిపోయిందని అనుకోవద్దని, కులం, హోదాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కుట్రను సొంత పార్టీ వాళ్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ను బలహీనపర్చాలని చూస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణం రేవంత్ అని, ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. సురేఖపై నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీరు ఏ పార్టీలోకి వెళ్తే ఆ పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా అని ప్రశ్నించారు. కష్టకాలంలో కాంగ్రెస్‌ను వదిలిపోయారని, వెళ్లేప్పుడు బీఫారం తీసుకుని వెళ్లారని విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రతిపక్షాలకు ఆయుధం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వంలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాదిమంది త్యాగాన్ని వృధా చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసిన వారిపై నిర్ణయాలు కఠినంగా ఉండాలన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకుని ఏమైనా చేస్తామంటే కుదరదన్నారు. డూప్లికేట్ మనుషులు.. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారని, ఏమైనా ఉంటే అధిష్ఠానం దగ్గర తేల్చుకోవాలని సూచించారు. పార్టీ నుంచి బహిష్కరించక ముందే వెళ్లిపోవాలని రాజేందర్ హితవు పలికారు.



# నటి షావుకారు జానకి కన్నుమూత



**మొదటిపేజీ తరువాయి**

తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులర్పించేందుకు ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయ వారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీ రంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. అలా 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే'లో కనిపించారు. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేశారు. కేవలం నాయికగానే కాక క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022లో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన పద్మశ్రీ అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులర్పిస్తున్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం**

షావుకారు జానకి మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాలపాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాక హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారన్నారు. పలు మేటి చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదన్నారు. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**ఎఫ్‌డీసీ చైర్మన్ సంతాపం**

షావుకారు జానకి మరణం పట్ల రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ జి.ముకుంద్ రెడ్డిలు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. వందలాది సినిమాల్లో నటించడం ద్వారా తెలుగు ప్రజలకు సురపరిచితురాలైన జానకి మరణించడం తెలుగు సినీ పరిశ్రమకు తీరనిలోటని వారన్నారు.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

- అందుకే సీఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం న్యూదిల్లీలో వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూదిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి బుధవారం అర్ధరాత్రి తర్వాత పది రోజుల విదేశీ పర్యటన కోసం లండన్‌కు బయలుదేరి వెళ్లారు. ముందు అనుకున్న ప్రకారం ఈనెల 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించనుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై చర్చించనుంది. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొననుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.



# పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలి

- నిరసనకు దిగిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20:**

పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. సంసద్ యాత్ర సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ అనే యువకుడు ఆరోపించాడు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తాను ఎన్నిసార్లు కోరినా పోలీసులు లక్ష్యపెట్టడం లేదని ఆరోపించాడు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తొలుత రాహుల్ గాంధీ కాన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, న్యూదిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంటు స్ట్రీట్ పీఎస్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. పెల్లెట్ గన్‌తో దాడి ఘటనపై దర్యాప్తు ఎంతవరకూ వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ రాహుల్ గాంధీ అకస్మాత్తుగా రావడంతో పోలీసులు ఒకింత ఆశ్చర్యపోయారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మాత్రం వారు తిరస్కరించారు. దీంతో, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సంసద్ చలో యాత్ర సందర్భంగా పార్లమెంటుకు సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విద్యార్థులపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే, దిల్లీ పోలీసులు మాత్రం ఈ ఆరోపణలు తోసిపుచ్చారు. సీఆర్‌పీఎఫ్ కూడా ఇప్పటివరకూ స్పందించలేదు.



# కారులో మహిళ మృతదేహం లభ్యం

- మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానసగా గుర్తింపు

**హన్మకొండ, ఆగస్ట్ 20 :**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కారులో మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో రెండ్రోజులుగా పార్క్ చేసిన కారు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కారు డిక్కీని ఓపెన్ చేయగా మహిళ మృతదేహం మూటకట్టి ఉంది. కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతురాలిని గోదావరిఖనికి చెందిన మానస (33)గా గుర్తించారు. కారును మానస స్నేహితుడు వినోద్ అద్దెకు తెచ్చినట్టు సమాచారం. దీంతో వినోద్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. 'కరీంనగర్‌లో గదిలో ఉన్నప్పుడు మానసకు ఫిట్స్ వచ్చాయి. ఫిట్స్, నోట్లో నుంచి నురగలు వచ్చి ఆమె చనిపోయింది. భయంతో మృతదేహాన్ని ఎల్కతుర్తి వద్ద కారులోనే వదిలి వెళ్లిపోయా' అని అతను పోలీసులకు చెప్పినట్టు తెలుస్తోంది. కేసు నమోదు చేసి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వినోద్ చెప్పిన విషయాలు నిర్ధారించుకునే పనిలో ఉన్నారు.

# బండి సంజయ్‌తో యోగి భేటీ

**లక్నో, ఆగస్టు 21:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా సశస్త్ర సీమా బల్ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం లక్నోలోని సీఎం అధికార నివాసానికి వెళ్లిన బండి సంజయ్.. యోగితో అరగంటకుపైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో బీజేపీ పరిస్థితి, రాష్ట్ర రాజకీయాలు, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం.

**తెలంగాణపై ప్రత్యేకంగా చర్చ**

తెలంగాణలో బీజేపీకి ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అభిప్రాయపడినట్లు తెలిసింది.

**డబుల్ ఇంజిన్‌తో అభివృద్ధి**

కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తోందని యోగి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పనులకు మరింత ఊతం లభిస్తుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ద్వారా పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.

**తెలంగాణలోనూ అధికారమే లక్ష్యం**

తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని యోగి అభిప్రాయపడ్డారు. బీజేపీ నేతలంతా సమష్టిగా పనిచేయాలని సూచించినట్లు సమాచారం.

**యూపీలో మళ్లీ కాషాయ జెండా**

త్వరలో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి విజయం సాధిస్తుందని యోగి ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీ బలాన్ని మరింత పెంచేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించినట్లు సమాచారం.



# మెక్‌డొనాల్డ్స్ సహా 14 సంస్థలపై వేటు

- ఆహార భద్రత నిబంధనల ఉల్లంఘనపై చర్యలు
- 89 సంస్థల్లో ప్రత్యేక తనిఖీలు
- 71 సంస్థలకు మెరుగుదల నోటీసులు
- రేడియో క్లబ్‌లో తీవ్ర పరిశుభ్రత లోపాలు
- మెక్‌డొనాల్డ్స్‌లోనూ ఉల్లంఘనలు గుర్తింపు
- రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం

**ముంబై, ఆగస్టు 21:**



మహారాష్ట్రలో ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనలు పాటించని 14 ఆహార సంస్థలపై ఆహార, ఔషధ పరిపాలన శాఖ చర్యలు తీసుకుంది. ముంబైలోని బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, కొలాబాలోని మెక్‌డొనాల్డ్స్ కేంద్రంతో పాటు రాష్ట్రంలోని మరో 12 సంస్థల ఆహార వ్యాపార అనుమతులను నిలిపివేసింది. ప్రత్యేక తనిఖీల్లో 89 హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలను పరిశీలించి 71 సంస్థలకు మెరుగుదల నోటీసులు జారీ చేసింది.

**రేడియో క్లబ్‌లో తీవ్ర లోపాలు**

ఆగస్టు 19న నిర్వహించిన తనిఖీల్లో రేడియో క్లబ్ వంటగదిలో ఈగలు, బొద్దింకలు కనిపించడంతో పాటు ఆహార పదార్థాల సమీపంలో రసాయనాలు నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆహారాన్ని నేలపై ఉంచడం, అపరిశుభ్ర శీతలీకరణ పరికరాలు, చెత్త నిర్వహణలో లోపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**మెక్‌డొనాల్డ్స్‌లోనూ ఉల్లంఘనలు**

కొలాబాలోని మెక్‌డొనాల్డ్స్ కేంద్రంలో గతంలో గుర్తించిన 20 లోపాల్లో 18 పునఃతనిఖీలోనూ పరిష్కరించలేదని అధికారులు తెలిపారు. సజీవ బొద్దింకలు, అపరిశుభ్ర వంటగది, ఆహార వ్యర్థాలు, పురుగు నియంత్రణ లోపాలు గుర్తించారు. ఆహార పదార్థాల్లో వినియోగించే పదార్థాల వివరాల విషయంలోనూ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

**మరో 12 సంస్థలపై చర్యలు**

మలాడ్‌లోని నొవారా రెస్టారెంట్, నరిమన్ పాయింట్‌లోని స్టేటస్ రెస్టారెంట్, ఖార్ జిమ్‌ఖానాతో పాటు సాంటాక్రూజ్, అంధేరి ప్రాంతాల్లోని సంస్థలపై కూడా చర్యలు తీసుకున్నారు. నాగ్‌పూర్, నాసిక్, అమరావతి, ఛత్రపతి శంభాజీనగర్, పర్భణీలోని పలు ఆహార సంస్థల అనుమతులను నిలిపివేశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతపై తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



# కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

- మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 21 :**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తాను చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన స్పష్టత ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ సీతా రామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా పార్టీ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వాన్ని నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పనిచేయాలని సూచిస్తూ పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల", సీమాంధ్ర నాయకుల కోసం కాదని అన్నారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు కమిటీలు

- సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

తెలంగాణ రైజింగ్‌ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్‌ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అలాగే దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్రసాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులకు సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్‌పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్‌ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# సొహ్రాబుద్దీన్ కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సోదరుడు

- 22 మంది నిర్దోషుల తీర్పుపై సవాలు
- మే 7న హైకోర్టు తీర్పుపై పిటిషన్
- 21 మంది పోలీసు అధికారులు నిందితులు
- 2005 నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో కీలక మలుపు
- కౌసర్ బీ, తులసీరాం హత్యలపై ఆరోపణలు
- దిగువ కోర్టుల తీర్పులపై పునర్విచారణ కోరుతూ పిటిషన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 21:**



సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బీ, సహాయకుడు తులసీరాం ప్రజాపతి హత్యల కేసులో కొత్త పరిణామం చోటుచేసుకుంది. కేసులో 21 మంది పోలీసు అధికారులు సహా 22 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సొహ్రాబుద్దీన్ సోదరుడు నయాబుద్దీన్ షేక్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మే 7న హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.

**2005లో సంచలనం**

2005లో గుజరాత్‌లో సొహ్రాబుద్దీన్ షేక్‌ను పోలీసులు నకిలీ ఎన్‌కౌంటర్‌లో హతమార్చారనే ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. కొద్ది రోజుల తర్వాత ఆయన భార్య కౌసర్ బీ కూడా హత్యకు గురైనట్లు దర్యాప్తులో ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు కీలక సాక్షిగా భావించిన తులసీరాం ప్రజాపతిని 2006 డిసెంబర్‌లో గుజరాత్, రాజస్థాన్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ముంబైకి మారిన విచారణ**

ఈ కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించడంతో పాటు విచారణను గుజరాత్ నుంచి ముంబైకి మార్చింది. 2018 డిసెంబర్‌లో ముంబై ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సొహ్రాబుద్దీన్ సోదరులు రుబాబుద్దీన్, నయాబుద్దీన్ బాంబే హైకోర్టులో అప్పీల్ చేశారు.

**ఆధారాలు సరిపోలేదన్న హైకోర్టు**

2026 మే 7న బాంబే హైకోర్టు ప్రత్యేక న్యాయస్థానం తీర్పులో జోక్యం చేసుకోవడానికి కారణాలు లేవంటూ అప్పీళ్లను కొట్టివేసింది. ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ప్రధానంగా పరిస్థితులపై ఆధారపడినవేనని, వాటి మధ్య కీలక సంబంధాలు నిరూపితం కాలేదని పేర్కొంది. సొహ్రాబుద్దీన్, కౌసర్ బీలను పోలీసులు అపహరించారనే ఆరోపణను కూడా ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని తెలిపింది.

**92 మంది సాక్షుల వాంగ్మూలాలపై చర్చ**

నకిలీ ఎన్‌కౌంటర్ కోసం కుట్ర లేదా ఉద్దేశం ఉన్నట్లు నిరూపించడంలోనూ ప్రాసిక్యూషన్ విఫలమైందని హైకోర్టు పేర్కొంది. విచారణలో 92 మంది ప్రాసిక్యూషన్ సాక్షులు తమ వాంగ్మూలాలను మార్చుకున్నప్పటికీ, ఆ కారణంతోనే విచారణ సక్రమంగా జరగలేదని నిర్ధారించలేమని స్పష్టం చేసింది.

**సుప్రీంకోర్టు నిర్ణయంపై ఆసక్తి**

నిర్దోషులుగా విడుదలైన 22 మందిలో 21 మంది గుజరాత్, రాజస్థాన్ పోలీసులకు చెందిన అధికారులు. మరో నిందితుడు గుజరాత్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రం యజమాని. సొహ్రాబుద్దీన్, కౌసర్ బీలను హత్యకు ముందు అక్కడ అక్రమంగా నిర్బంధించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేక సీబీఐ కోర్టు తీర్పును సవాలు చేస్తూ కుటుంబ సభ్యులు చేసిన అప్పీళ్లను హైకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో.. ఇప్పుడు నయాబుద్దీన్ సుప్రీంకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, అఫర్ జనరేషన్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు అనుసంధానం, ఆఫర్ జనరేషన్, ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతిని సమీక్షించారు. ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రీ–ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ లకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఎఫ్ ఎల్ ఎన్ ప్రగతి, ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని, పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు, నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ జన్మదిన వేడుకలు...

**శుభాంక్షలు తెలిపిన శంకర్ పల్లి కాంగ్రెసు నాయకులు**



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తనయుడు, మొయినాబాద్ మాజీ జెడ్పిటిసి కాలె శ్రీకాంత్ జన్మదిన వేడుకలు శుక్రవారం రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భానంగా శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం వెంకటరెడ్డి, డిసిసి వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి చేవెళ్లలో కాలే శ్రీకాంత్ ను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాలే శ్రీకాంత్ ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మునిసిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మైనారిటీ నాయకులు, శంకర్ పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన మోకిల పోలీసులు



**2.80 కిలోల గంజాయి స్వాధీనం**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం (20.08.2026) రోజు మోకిల పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో జన్వాడ గేటు సమీపంలో తనిఖీలు నిర్వహించగా, AP 29 BX 3751 నంబర్ గల స్పెండర్ + బైక్‌పై వస్తున్న జగన్నాథ్ మండల్ (42) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లో రెండు పార్సిళ్లుగా మొత్తం 2 కిలోల 80 గ్రాముల డ్రై గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడి మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం, గంజాయి తరలించేందుకు ఉపయోగించిన హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఒడిశా ప్రాంతం నుండి గంజాయిని తీసుకువచ్చి జన్వాడ ప్రాంతంలోని కూలీలకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు పంపించబడినది. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# పోలీస్ అసోసియేషన్ పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్ డివిజన్‌లలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా డీపీఓ లో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా 50 మంది పురుష పోలీస్ సిబ్బందికి ఒక ప్రతినిధిని, 40 మంది మహిళా సిబ్బంది కలసి ఒక ప్రతినిధి ని ఎన్నుకుంటారు. అనంతరం ఎన్నికైన ప్రతినిధులందరూ కలిసి జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా డి సి ఆర్ బి డి.ఎస్.పి జనయ్య, డీటీసీ డి.ఎస్.పి శ్రీనివాస్, డి ఎస్ బి ఇన్‌స్పెక్టర్లు నాగార్జున, జములప్ప, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకుని రావాలి




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ సూర్యాపేట పట్టణంలో యునైటెడ్ ట్రస్మా, ప్రైవేటు స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు పట్టణంలోని పలు వీధుల గుండా వారు ర్యాలీ నిర్వహిస్తూ మాదకద్రవ్యాల నుండి విద్యార్థులను కాపాడాలని, మాదకద్రవ్యాల విక్రయాన్ని అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు... ఉపాధ్యాయుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు.అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి లో గంజాయి కి అలవాటు పడిన విద్యార్థులు తమ ప్రవర్తన మార్చుకోవాలని మందలించినందుకు గాను ప్రిన్సిపాల్ రూపారెడ్డిని దారుణంగా హత్య చేశారని ఈ సంఘటన ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర భయభ్రాంతులకు చేస్తుందని వారు అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం మందలిస్తారని అయినప్పటికీ కొందరు తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకోవడం లేదని వాళ్ళు అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు మద్దతు ఇవ్వాలని వారి పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని, సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలని అన్నారు. చెడు అలవాట్లు నేర్చుకునే వీడియోల వలన విద్యార్థులు పాడవుతున్నారని కాబట్టి విద్యార్థులకు సెల్ ఫోన్ లను దూరంగా ఉంచాలని వారు తల్లిదండ్రులకు హితవుపలికారు. సమాజంలో జరుగుతున్నటువంటి హింసను అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ట్రాస్మా ప్రతినిధులు త్రివేణి హరి, ప్రకాష్ రెడ్డి, పగడాల ఉపేందర్ రెడ్డి, రామసాని శ్రీనివాస నాయుడు, ఖమ్మంపాటి భిక్షపతి, గాలి రమేష్, మారం లింగారెడ్డి, వెంపటి అజయ్ కుమార్, తీగల ఉపేందర్ రావు, నరసింహారావు, సోమరాజు,ఉపాధ్యాయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకుని రావాలి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ సూర్యాపేట పట్టణంలో యునైటెడ్ ట్రస్మా, ప్రైవేటు స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు.పట్టణంలోని పలు వీధుల గుండా వారు ర్యాలీ నిర్వహిస్తూ మాదకద్రవ్యాల నుండి విద్యార్థులను కాపాడాలని, మాదకద్రవ్యాల విక్రయాన్ని అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు... ఉపాధ్యాయుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి లో గంజాయి కి అలవాటు పడిన విద్యార్థులు తమ ప్రవర్తన మార్చుకోవాలని మందలించినందుకు గాను ప్రిన్సిపాల్ రూపారెడ్డిని దారుణంగా హత్య చేశారని ఈ సంఘటన ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర భయభ్రాంతులకు చేస్తుందని వారు అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం మందలిస్తారని అయినప్పటికీ కొందరు తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకోవడం లేదని వాళ్ళు అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు మద్దతు ఇవ్వాలని వారి పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని, సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలని అన్నారు. చెడు అలవాట్లు నేర్చుకునే వీడియోల వలన విద్యార్థులు పాడవుతున్నారని కాబట్టి విద్యార్థులకు సెల్ ఫోన్ లను దూరంగా ఉంచాలని వారు తల్లిదండ్రులకు హితవుపలికారు. సమాజంలో జరుగుతున్నటువంటి హింసను అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ట్రాస్మా ప్రతినిధులు త్రివేణి హరి, ప్రకాష్ రెడ్డి, పగడాల ఉపేందర్ రెడ్డి, రామసాని శ్రీనివాస నాయుడు, ఖమ్మంపాటి భిక్షపతి, గాలి రమేష్, మారం లింగారెడ్డి, వెంపటి అజయ్ కుమార్, తీగల ఉపేందర్ రావు,నరసింహారావు, సోమరాజు,యాదాసు కృష్ణ, బాలకృష్ణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మావల మండల కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా, ఎలాంటి ఆలస్యం లేకుండా అందాలనే ఉద్దేశంతోనే ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యం రావు, ఎంపీఓ నందిని, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ స్వప్న అడెల్లు, వార్డు సభ్యులు, కంట్రోల్ డీలర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఏ 1' సెలూన్ ప్రారంభోత్సవం

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:**

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఏ1' సెలూన్ అండ్ హెయిర్ కటింగ్ షాప్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బెన్ కట్ చేసి నూతన సెలూన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అత్యాధునిక హంగులతో, అందుబాటు ధరల్లో నాణ్యమైన సేవలు అందించడానికి ఈ సెలూన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత ఇలాంటి స్వయం ఉపాధి రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి రాణించడం సంతోషకరమని పేర్కొన్నారు. సెలూన్ నిర్వాహకులు వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వరలక్ష్మి వ్రతం నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** శ్రావణ శుక్రవారం సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ దంపతులు తమ స్వగృహంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంతో పాటు రాష్ట్ర, ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంపై వరలక్ష్మి దేవి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సాంప్రదాయాల ప్రకారం దైవ ప్రార్థనలు చేస్తూ మానసిక ప్రశాంతతతో, ఆనందంగా జీవించాలని కోరారు.

# పోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

## రూ.2వేల జరిమానా విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు



**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ పాఠశాల ప్రాంగణంలోకి గోడ దూకి ప్రవేశించిన అగదండి రాజేందర్ అనే వ్యక్తి మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు అప్పటి గంభీరావుపేట ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. మొత్తం పది మంది సాక్షులను విచారించగా, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ వాదనలు వినిపించారు. ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి ఈ మేరకు శిక్ష విధించినట్లు తెలిపారు. సమాజంలో నేరాలకు పాల్పడే వారు ఎవరూ చట్టపరమైన శిక్ష నుంచి తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ తెలిపారు. శిక్షల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో సమర్థవంతమైన దర్యాప్తు, న్యాయ విచారణ చేపట్టి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి ఎస్సై మహేష్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాన్సీ, ఎల్లారెడ్డిపేట సర్కిల్ సీఐ ఓ.వెంకటేష్, గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను ఎస్పీ అభినందించారు.

# నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శుక్రవారం భాగ్యనగర్లో భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, ఉద్యమశీలత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్స్ మోడల్ సెంటర్' నమూనాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ హాజరై వివిధ నమూనాలను పరిశీలించారు. జన్ శిక్షణ్ సంస్థాన్లో శిక్షణ పొందిన అభ్యర్థులు రూపొందించిన చేతివృత్తుల వస్తువులు, కుట్టుపని ఉత్పత్తులు, వివిధ వృత్తి విద్యా ఉత్పత్తులు, ఇతర నైపుణ్య ఆధారిత నమూనాలను తిలకించారు. అభ్యర్థులు రూపొందించిన ఉత్పత్తులను అభినందించారు. శిక్షణ పూర్తయిన అనంతరం స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. సాంకేతిక, వృత్తి విద్యా రంగాల్లో నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జన్ శిక్షణ్ సంస్థాన్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఉపాధి, స్వయం ఉపాధి కోసం వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.మనోహర్రావు, జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి, ఎల్డీఎం ఉత్పాల్, సెడ్స్ డైరెక్టర్ సురేందర్, వివిధ శాఖల అధికారులు, జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రతినిధులు, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం



**రాజముద్ర న్యూస్, జైనూర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాథ్రావు అన్నారు. సిర్పూర్ (యూ) మండలం ధానోరా గ్రామపంచాయతీ పరిధిలోని ధానోరా తండాలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై నూతన గృహంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ ప్రమోద్, ఏపీఓ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పెంధోర్ గణపత్, మహాగాం సర్పంచ్ సేడ్మకి జనేరావు, ఆత్రం జలీమ్ షావ్, సోయం ముకుంద్రావు, ఆత్రం దౌలత్రావు, షేక్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు



**రాజముద్ర న్యూస్, తిర్యాణి:** మారుమూల గిరిజన గ్రామాల సమస్యలను పరిష్కరించి, గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తిర్యాణి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించి, ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దంతన్పల్లిని సందర్శించగా, గతంలో మూసివేసిన గురైన ఆశ్రమ పాఠశాలను తిరిగి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పీఓ, పాఠశాల పునఃస్థాపనకు సంబంధించిన సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని సంబంధిత డీడీని ఆదేశించారు. పాఠశాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం పంగిడి మాదన రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు. తిర్యాణి మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పంగిడి మాదనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే గోవెన, మార్కెగూడ తదితర గ్రామాలకు బిటి కనెక్టివిటీ రోడ్లు నిర్మించాలని పీఓను కోరారు. దీనిపై పీఓ స్పందిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత పంగిడి మాదన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, సౌకర్యాలను పరిశీలించిన పీఓ, పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను సేకరించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నెల రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, నిర్దిష్ట లక్ష్యాలతో బోధన చేపట్టాలని ఆదేశించారు.చివరగా చింతల మాదార జలపాతాన్ని సందర్శించి, పరిసర ప్రాంతాల్లో స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచ్, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో డీడీ జాదవ్ అంబాజీ, ఏ సి ఎం ఓ ఉద్ధవ్, సర్పంచ్ రాధాబాయి, స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి





**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్లో ఉన్న భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలోని పెండింగ్ భూసేకరణ అంశాలపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేందుకు భూసేకరణ ప్రక్రియ కీలకమని తెలిపారు. పెండింగ్ భూసేకరణకు అవసరమైన నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భూసేకరణ కోసం రూ.2,800 కోట్లు విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా కొత్త ఆయకట్టు సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు భూసేకరణ, పునరావాస ప్రక్రియలను సమాంతరంగా వేగవంతం చేయాలని సూచించారు. నిధులు అందుబాటులో ఉన్నందున కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాస పనుల కారణంగా ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అన్నారు. క్షేత్రస్థాయిలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో నిర్వాసితులకు పునరావాస చర్యలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పనుల పురోగతి, భూసేకరణ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు, యువత కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు వివిధ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ, విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్లోని ఉర్దూ భవన్లో తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉర్దూ అకాడమీ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్, పబ్లిక్ రీడింగ్ రూమ్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు ప్రతిఒక్కరికీ ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా మైనారిటీ వర్గాలకు చెందిన యువత, నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు పబ్లిక్ రీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న కంప్యూటర్ శిక్షణ, రీడింగ్ రూమ్ వంటి సదుపాయాలను యువతీ యువకులు పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలీం, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేష్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేట్ నెంబర్ 68ను మూసివేయొద్దు



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైల్వే గేట్ నం.68ను మూసివేయవద్దని కోరుతూ కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్తో పాటు గ్రామస్తులు తహశీల్దార్ యు.జ్యోత్స్న, ఎంపీడీఓ పి.శ్రీనివాస్లకు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. రైల్వే శాఖ గేట్ను మూసివేసి ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు సమాచారం ఉందని తెలిపారు. ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా మండలంలోని ప్రధాన బ్రిడ్జిల వద్ద నీరు నిలిచిపోవడంతో తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రేపల్లెవాడ వద్ద ఉన్న రైల్వే గేట్ మార్గం అనేక ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉందన్నారు. గేట్ను మూసివేస్తే అంబులెన్సుల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు విద్యార్థుల బస్సులు, ఇతర రవాణా వ్యవస్థలపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు మండలాల ప్రజల సాధారణ రాకపోకలు, వ్యవసాయ, వాణిజ్య, ఉపాధి, నిత్యావసర కార్యకలాపాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైల్వే గేట్ ను మూసివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్దిబోయిన శంకర్, ఉపాధ్యక్షుడు షేక్ మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శి కట్కూల మల్లేష్, మండల యూత్ మాజీ అధ్యక్షుడు దేగ స్వామి, ఆకుల రజిని, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# 24న ఆటోల బంద్ జయప్రదం చేయండి



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఈనెల 24న నిర్వహించనున్న ఆటోల బంద్ను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆటో కార్మికులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలోని శ్రీ ఆంజనేయ ఆటో యూనియన్ అడ్డా వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు మాట్లాడుతూ ఆర్టీసీ అనుసంధానంతో ఈవీ ఆటో విధానాన్ని తీసుకొస్తే ఆటో కార్మికుల జీవితాలు బుగ్గిపాలు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన రూ.12వేల ఆర్థిక సాయం హామీని సీఎం రేవంత్రెడ్డి ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. అలాగే ఆటో కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. సీఎం రేవంత్ సారు.. మీ హామీ అమలెక్కడ..? అని ప్రశ్నించారు. ఆటో బంద్లో రాజకీయాలకు అతీతంగా ఆటో, ట్రాక్టర్, కారు, జేసీబీ ఆపరేటర్లు పాల్గొని బంద్ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ అడ్డా అధ్యక్షులు సాధు సుధాకర్, కోశాధికారి రియాజ్, పూరేటి మల్లయ్య, బొందల యాకోబు, కంచర్ల వెంకటేశ్వరరావు, కొండయ్య, సురేష్, షేక్ యాకూబ్, కావూరి భగత్సింగ్, ముల్లంగి శ్రీను, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# రెండో టెస్టుకు లంక కొత్త అస్త్రాలు

## జట్టులోకి మిషారా, ఆరాచ్చిగే

- గాయాలతో ముగ్గురు కీలక ఆటగాళ్లు దూరం
- మెండిస్, నిస్సాంక, చాండిమాల్‌కు విశ్రాంతి
- తొలి టెస్టు ఓటమికి బదులు తీర్చుకోవాలని లంక
- సిరీస్ క్లీన్‌స్వీప్‌పై భారత్ కన్ను



**కొలంబో:** భారత్‌తో జరిగే రెండో టెస్టుకు శ్రీలంక కీలక మార్పులతో సిద్ధమవుతోంది. గాయాలతో పలువురు ప్రధాన ఆటగాళ్లు దూరం కావడంతో దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను జట్టులోకి తీసుకుంది. ఆగస్టు 23 నుంచి కొలంబోలోని సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో భారత్ చేతిలో 165 పరుగుల తేడాతో ఓటమిపాలైన శ్రీలంకకు రెండో టెస్టుకు ముందు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. కుశాల్ మెండిస్ గాయం కారణంగా దూరం కాగా, పాథుమ్ నిస్సాంక పూర్తిస్థాయిలో కోలుకోలేదు. గాలే టెస్టులో కన్‌కషన్‌కు గురైన దినేశ్ చాండిమాల్ కూడా రెండో టెస్టుకు అందుబాటులో ఉ ఒడటం లేదు. కీలక బ్యాటర్లు ముగ్గురు దూరం కావడంతో శ్రీలంక బ్యాటింగ్ విభాగంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో దేశవాళీ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్న కమీల్ మిషారా, సహన్ ఆరాచ్చిగేలను సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి వీరిద్దరిలో ఒకరికి లేదా ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. భారత్ వంటి బలమైన ప్రత్యర్థిపై అవకాశం లభిస్తే తమ ప్రతిభను నిరూపించుకునేందుకు వారికి ఇదో కీలక వేదిక కానుంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. ఇప్పుడు కొలంబోలోనూ అదే జోరు కొనసాగించి సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు సొంతగడ్డపై సిరీస్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే శ్రీలంకకు రెండో టెస్టులో విజయం తప్పనిసరిగా మారింది. ధనంజయ డి సిల్వా నాయకత్వంలోని శ్రీలంక జట్టులో లహిరు ఉదారా, కమీల్ మిషారా, పసిందు సూరియబండారా, కమిందు మెండిస్, సహన్ ఆరాచ్చిగే, సోనల్ దినూషా, నిరోషన్ డిక్వెల్లా, కేశర నువాన్థా, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అసిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో చోటు దక్కించుకున్నారు. కీలక ఆటగాళు లేకుండానే భారత్‌ను నిలువరించాల్సిన పరిస్థితి రావడంతో కొలంబో టెస్టు శ్రీలంకకు అసలైన పరీక్షగా మారనుంది.

# యూఎస్ ఓపెన్‌లో కనకవర్షం!

- చరిత్రలోనే భారీ ప్రైజ్‌పూల్
- మొత్తం పరిహారం రూ.వెయ్యి కోట్లకు చేరువ
- సింగిల్స్ విజేతకు రూ.52.65 కోట్లు
- ఆగస్టు 23 నుంచి గ్రాండ్‌స్లామ్ సమరం
- అల్కరాజ్ పునరాగమనంపై అందరి చూపు



**న్యూయార్క్:** టెన్నిస్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్‌లలో ఒకటైన యూఎస్ ఓపెన్–2026 రికార్డు స్థాయి ప్రైజ్‌మనీతో సరికొత్త చరిత్రకు సిద్ధమైంది. ఈసారి ఆటగాళ్లకు అందించే మొత్తం పరిహారాన్ని 108 మిలియన్ డాలర్లకు పెంచారు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే ఇది భారీ మొత్తంగా నిలవనుంది. 2024తో పోలిస్తే ఏకంగా 44 శాతం పెరుగుదల నమోదైంది. పురుషుల, మహిళల సింగిల్స్ ఛాంపియన్లకు భారీ నజరానా ఎదురుచూస్తోంది. ఒక్కో సింగిల్స్ విజేతకు సుమారు రూ.52.65 కోట్ల నగదు బహుమతి దక్కనుంది. గత ఏడాదితో పోలిస్తే విజేతలకు అందించే ప్రైజ్‌మనీని 10 శాతం పెంచారు. దీంతో టైటిల్‌తో పాటు భారీ చెక్కు కోసం కూడా అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ ఈ భారీ ప్రైజ్‌మనీ వివరాలను ప్రకటించింది. ఆటగాళ్లపై పెట్టుబడులను మరింత పెంచే దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆటగాళ్లు, అభిమానులు, భాగస్వాములకు యూఎస్ ఓపెన్‌ను మరింత విలువైన వేదికగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. యూఎస్ ఓపెన్ ప్రధాన పోటీలు ఆగస్టు 23న ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 13న పురుషుల సింగిల్స్ ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్లు బరిలోకి దిగనుండటంతో టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మరోవైపు స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్‌పైనా అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మణికట్టు గాయం కారణంగా కొంతకాలంగా పోటీ టెన్నిస్‌కు దూరంగా ఉన్న అల్కరాజ్ యూఎస్ ఓపెన్‌తో పునరాగమనం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గాయం నుంచి కోలుకుని అతడు ఏ స్థాయిలో రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. రికార్డు ప్రైజ్‌మనీ.. ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్ల పోరు.. టైటిల్ కోసం ఉత్కంఠభరిత సమరం.. ఇలా యూఎస్ ఓపెన్–2026 టెన్నిస్ అభిమానులకు భారీ విందుగా మారనుంది.

# సింధు కథ ముగిసె.. డబుల్స్‌పైనే పతక ఆశలు!






**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ఆరో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగిన సింధు.. మూడో ర్యాంకర్, చైనా షట్లర్ వాంగ్ జి యి చేతిలో హోరాహోరీ పోరులో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో సంచలన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ షట్లర్ ఆయుష్ శెట్టి కూడా ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిదారి పట్టాడు. దీంతో సింగిల్స్‌లో భారత పోరు ముగిసింది. అయితే మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్–ట్రీసా జాలీ, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్‌కు చేరి పతక ఆశలను సజీవంగా ఉంచారు.

### పోరాడి ఓడిన సింధు

కెరీర్‌లో 11వసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన సింధు.. ప్రిక్వార్టర్స్‌లో వాంగ్ జి యి చేతిలో 11–21, 21–15, 17–21 తేడాతో ఓడిపోయింది. దాదాపు గంటన్నరపాటు సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకుంది. నెట్ గేమ్, క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో చెలరేగి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ సింధు ఒక దశలో 13–10 ఆధిక్యంలో నిలిచింది. అయితే వాంగ్ సుదీర్ఘ ర్యాలీలతో పుంజుకుని 15–15తో స్కోరును సమం చేసింది. కాళ్ల కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ చైనా షట్లర్ పోరాటం కొనసాగించింది. చివరి దశలో సింధు చేసిన తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న వాంగ్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. వాంగ్ చేతిలో సింధుకు ఇది ఆరో ఓటమి.

### ఆయుష్ జోరుకు బ్రేక్

పురుషుల సింగిల్స్‌లో 21 ఏళ్ల ఆయుష్ శెట్టి పోరాటం కూడా ప్రిక్వార్టర్స్‌లో ముగిసింది. తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ షి యుచిని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రిక్వార్టర్స్‌లో ఇండోనేషియాకు చెందిన అల్వీ ఫర్హాన్ చేతిలో 19–21, 11–21తో వరుస గేమ్‌ల్లో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో గట్టిపోటీ ఇచ్చిన ఆయుష్ రెండో గేమ్‌లో మాత్రం ప్రత్యర్థి జోరును అడ్డుకోలేకపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో జోడీ కూడా నిరాశపరిచింది. చైనాకు చెందిన గువో జిన్‌వా–చెన్ ఫాంగ్‌హుయ్ జోడీ చేతిలో 16–21, 5–21తో ఓటమి పాలైంది.

### సాత్విక్-చిరాగ్ థ్రిల్లింగ్ విక్టరీ

పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ఉత్కంఠ పోరులో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఐదో సీడ్ భారత ద్వయం 21–23, 21–19, 21–17తో మలేషియాకు చెందిన జునైదీ ఆరిఫ్–యాప్ రాయ్ కింగ్ జోడీని ఓడించింది. గంటా 22 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను తృటిలో చేజార్చుకున్న సాత్విక్–చిరాగ్ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నారు. వరుసగా రెండు గేమ్‌లు గెలిచి క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నారు.

### గాయత్రి-ట్రీసా మరో సంచలనం

మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్–ట్రీసా జాలీ జోడీ సంచలన ప్రదర్శన కొనసాగించింది. ప్రిక్వార్టర్స్‌లో ఏడో ర్యాంక్ జపాన్ జోడీ రిన్ ఇవానాగా–కీ నకానిషిని 21–16, 21–12తో వరుస గేమ్‌ల్లో చిత్తు చేసింది. ఆరంభం నుంచే మ్యాచ్‌పై ఆధిపత్యం చెలాయించిన భారత జోడీ ప్రత్యర్థులకు పుంజుకునే అవకాశమే ఇవ్వలేదు. గాయం నుంచి కోలుకుని తిరిగి వచ్చిన ట్రీసా.. గాయత్రితో కలిసి అద్భుత సమన్వయంతో ఆడింది. ఈ విజయంతో భారత జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి మరింత చేరువైంది. సింగిల్స్‌లో భారత ఆశలు ముగిసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత పతక ఆశలు ప్రధానంగా గాయత్రి–ట్రీసా, సాత్విక్–చిరాగ్ జోడీలపైనే నిలిచాయి.




# 15 ఏళ్ల నిరీక్షణకు తెర!

## ప్రపంచ బ్యాడ్మింటన్‌లో గాయత్రి-ట్రీసా సంచలనం

- నాలుగో సీడ్ చైనా జోడీకి షాక్
- మూడు గేమ్‌ల పోరులో అద్భుత విజయం
- మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం
- జ్వాల-అశ్విని తర్వాత రెండో భారత జోడీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్లు గాయత్రి గోపిచంద్–ట్రీసా జాలీ చరిత్ర సృష్టించారు. మహిళల డబుల్స్‌లో అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తున్న భారత జోడీ.. నాలుగో సీడ్ చైనా ద్వయాన్ని మట్టికరిపించి పతకాన్ని ఖాయం చేసింది. తద్వారా మహిళల డబుల్స్‌లో భారత్‌కు 15 ఏళ్లుగా కొనసాగుతున్న పతక నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన కీలక పోరులో చైనాకు చెందిన జియా యి ఫాన్–జాంగ్ షు షియాన్ జోడీతో గాయత్రి–ట్రీసా అమీతుమీ తేల్చుకున్నారు. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌ను భారత జోడీ 16–21తో కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా అద్భుతంగా పుంజుకుంది. రెండో గేమ్‌లో దూకుడు పెంచి 21–15తో చైనా జోడీని చిత్తు చేసి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో భారత అమ్మాయిల జోరు ముందు చైనా జోడీ నిలువలేకపోయింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన గాయత్రి–ట్రీసా 21–13తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. నాలుగో సీడ్ జోడీని ఓడించి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో భారత మహిళల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి–ట్రీసా కొత్త అధ్యాయం లిఖించారు. 2011లో జ్వాలా గుత్తా–అశ్విని పొన్నప్ప జోడీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత మహిళల డబుల్స్‌లో భారత్‌కు మరో పతకం దక్కలేదు. ఇప్పుడు 15 ఏళ్ల తర్వాత గాయత్రి–ట్రీసా ఆ నిరీక్షణకు తెరదించారు. అంతకుముందు కూడా భారత జోడీ సంచలన ప్రదర్శన చేసింది. వరుసగా ఉన్నత సీడ్ జోడీలను ఇంటిముఖం పట్టిస్తూ పతక పోరుకు చేరింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమిస్తూ గాయత్రి–ట్రీసా కనబరిచిన పోరాట పటిమ భారత బ్యాడ్మింటన్‌లో మరో చారిత్రక విజయానికి బాటలు వేసింది.

# ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

## బ్రెజిల్‌లో మహిళల ఫుట్‌బాల్ సమరం

- ఎనిమిది నగరాల్లో 64 మ్యాచ్‌లు
- 2027 జూన్ 24న బ్రెజిల్ తొలి పోరు
- జూలై 25న మరాకానాలో మహా ఫైనల్
- తొలిసారి దక్షిణ అమెరికా గడ్డపై మెగా టోర్నీ

**జ్యూరిచ్:** ఫుట్‌బాల్ అభిమానులకు మరో మహా సమరానికి రంగం సిద్ధమైంది. బ్రెజిల్ వేదికగా జరిగే 2027 ఫిఫా మహిళల ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఫిఫా గురువారం విడుదల చేసింది. దక్షిణ అమెరికా గడ్డపై తొలిసారిగా మహిళల ప్రపంచకప్ జరగనుండటంతో ఈ మెగా టోర్నీపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్రెజిల్‌లోని ఎనిమిది ప్రధాన నగరాల్లో మొత్తం 64 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఉన్న ఫిఫా ప్రధాన కార్యాలయంలో ప్లేఆఫ్ టోర్నమెంట్ ప్రాథమిక దశ డ్రా సందర్భంగా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆతిథ్య బ్రెజిల్ తన తొలి మ్యాచ్‌ను జూన్ 24న రియో డి జనీరోలోని ప్రఖ్యాత మరాకానా స్టేడియంలో ఆడనుంది. జూలై 4న బ్రెసిలియాలో బ్రెజిల్ తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. ప్రపంచకప్ మ్యాచ్‌లను బ్రెజిల్‌లోని 8నగరాల్లో నిర్వహించనున్నారు. రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లకు బ్రెసిలియా, పోర్టో అలెగ్రే, రెస్సిఫె, సాల్వడార్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. క్వార్టర్ ఫైనల్ పోరాటాలు బెలో హోరిజోంటే, ఫోర్టలేజాతో పాటు రియో డి జనీరో, సావోపాలో నగరాల్లో జరగనున్నాయి. సావోపాలోలో ఒక సెమీఫైనల్‌తో పాటు మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. మరో సెమీఫైనల్‌తో పాటు జూలై 25న జరిగే టైటిల్ పోరుకు మరాకానా స్టేడియం వేదిక కానుంది. 2027 మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా మరాకానా స్టేడియం అరుదైన రికార్డును సొంతం చేసుకోనుం ది. పురుషుల ప్రపంచకప్ ఫైనల్‌తో పాటు మహిళల ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా వేదికైన మూడో స్టేడియంగా నిలవనుంది. గతంలో స్వీడన్‌లోని రసుండా స్టేడియం, అమెరికాలోని రోజ్‌బౌల్ మాత్రమే ఈ ఘనత సాధించాయి. ప్రపంచకప్ జరిగే సమయం లో బ్రెజిల్ వ్యాప్తంగా ఫిఫా అభిమానుల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో తెలిపారు. స్టేడియాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా అభిమానులు ప్రపంచకప్ సంబరాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.







## 100 కోట్ల క్లబ్‌లోకి కనగరాజ్ సినిమా!

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' (DC) సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.



## 'టాక్సిక్'తో యష్ ఆ ఫీట్ సాధిస్తాడా..?

'కేజీఎఫ్' 1-2 విజయాల తర్వాత రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' ఆగస్టు 26న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీకి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై అంచనాలు పెంచేసింది. భారతదేశంలో ఇప్పటికే రూ. 15 కోట్ల అడ్వాన్స్ బుకింగ్స్ నమోదు చేయగా, ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో ఊపు పెరిగితే తొలిరోజే వంద కోట్ల మార్కును అందుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే లాంగ్ రన్ చాలా కీలకం. నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి తారలు నటిస్తున్న ఈ చిత్రాన్ని గీతు మోహన్‌దాస్ తెరకెక్కించారు. ప్రొడక్షన్ వాల్యూస్ పరంగా ఎక్కడా తగ్గకుండా నిర్మించిన ఈ సినిమా లాంగ్ రన్ ఫలితం మాత్రం ప్రీమియర్ షోల టాక్ మరియు ఆరంభ రివ్యూలపైనే ఆధారపడి ఉంది. మరి నిజంగానే యష్ 'టాక్సిక్'తో మూడు అంకెల ఓపెనింగ్స్ సాధిస్తాడా అనేది చూడాలి.



## 'స్పిరిట్'పై ఆ వార్తతో ఫ్యాన్స్ ఆందోళన..

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'స్పిరిట్' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రం కథ ప్రధానంగా హైదరాబాద్ నేపథ్యంలోనే సాగుతుందని ఆయన తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఆందోళనకు గురవుతున్నారు. పాన్ ఇండియా రేంజ్ హీరోను హైదరాబాద్ వ్యక్తిగా చూపిస్తే ఆడియన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే కథ పరిధి కంటే సందీప్ వంగా మార్క్ డ్రామా, క్యారెక్టరైజేషనే సినిమాకు ప్రధాన బలంగా మారనున్నాయి. 'యానిమల్' చిత్రాన్ని కూడా ఏరియా మార్చకుండా ఒకే సిటీ బ్యాక్‌డ్రాప్‌లో తీసి ప్యాన్ ఇండియా స్థాయిలో ఎలాంటి ఇంపాక్ట్ చూపించాడో అందరికీ తెలిసిందే. త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## 'మూకుతి అమ్మన్ 2'లో విలన్‌గా రెజీనా..



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో 'మూకుతి అమ్మన్ 2' ఒకటి. 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న దైవభక్తి, ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన 'మూకుతి అమ్మన్' సినిమాకు ఇది సీక్వెల్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి భాగానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, రెండో భాగాన్ని ప్రముఖ నటుడు, దర్శకుడు సుందర్ సి తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ భారీ చిత్రంలో ప్రముఖ నటి రెజీనా కసాండ్రా కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఆమె ఈ సినిమాలో ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం దర్శకుడు సుందర్ సి ప్రత్యేకంగా ఓ శక్తివంతమైన క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. రెజీనాను ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని విధంగా, సరికొత్త లుక్‌లో ఈ సినిమాలో చూపించనున్నారట. నయనతారకు దీటుగా సాగే ఈ పాత్ర కథలో అత్యంత కీలకంగా ఉండబోతుందని టాక్. దీంతో 'మూకుతి అమ్మన్ 2'లో నయనతార వర్సెస్ రెజీనా పోరాటం ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరిగింది. ఈ సినిమాను ప్రముఖ తమిళ నిర్మాత డాక్టర్ ఇషారి కె. గణేష్ తన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 'మూకుతి అమ్మన్ 2'ను రూ.100 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలి భాగంతో పోలిస్తే రెండో భాగంలో విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ అంశాలు, యాక్షన్ సన్నివేశాలను మరింత భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. సుందర్ సి ఇప్పటికే 'అరణ్మనై' హారర్-కామెడీ ఫ్రాంచైజ్‌తో భారీ విజయాలు అందుకున్నారు. ఫాంటసీ, హారర్, కామెడీ, విజువల్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఇప్పుడు 'మూకుతి అమ్మన్ 2'ను కూడా అదే స్థాయిలో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. థియేట్రికల్ విడుదల తర్వాత స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్ భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. సినిమా ఫుటేజ్ చూసిన తర్వాతే ఈ డీల్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com